సాక్షి
ఖమ్మం
శుక్రవారం । 4 । జూలై । 2025



... వార్డుల విభజన

కొత్తగా ఏర్పడిన కల్లూరు, ఏదులాపురం మున్సిపాలిటీల్లో వార్డుల విభజన పూర్తికాగా ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. 4లో



'రివర్ సైడ్'కు ఆదరణ కరువు

భద్రాచలంలో గోదావరి తీరాన ఏర్పాటుచేసిన రివర్‌సైడ్ విడిది కుటీరాలకు ఆదరణ లేకపోవడంతో తొలగిస్తున్నారు. 4లో

గరిష్టం / కనిష్టం
32° / 25°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అంతర పంటలతో అదనపు ఆదాయం



మొక్కలను పరిశీలిస్తున్న డీఏఓ పుల్లయ్య

రఘునాథపాలెం: రైతులు ప్రధాన పంటలతో పాటే అంతర పంటలు సాగు చేస్తే అదనంగా ఆదాయం లభిస్తుందని జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య తెలిపారు. ఇదే సమయాన నానో ఎరువుల వాడకంతో భూసారం పెంచుకోవచ్చని చెప్పారు. రఘునాథపాలెం మండలం వేపకుంట్లలో పలువురు రైతుల ఆయిల్‌పామ్ తోటలు, అంతర పంటలుగా సాగు చేస్తున్న పత్తి, పెసర పంటలను పరిశీలించి సూచనలు చేశారు. నానో యూరియా, నానో డీఏపీ వినియోగంతో రసాయన ఎరువుల భారం తగ్గుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ కర్నాటి ఉమామహేశ్వర్‌రెడ్డి, ఏఈఓ ప్రతిభ పాల్గొన్నారు. కాగా, మండలంలోని హరియా తండాలో నానో యూరియా, నానో డీఏపీ వినియోగంతో లాభాలపై ఏఓ ఉమామహేశ్వర్‌రెడ్డి అవగాహన కల్పించారు. ఏఈఓ శివకుమార్ పాల్గొన్నారు.

లీడ్ బ్యాంక్ మేనేజర్‌గా రవిప్రసాద్

ఖమ్మంవ్యవసాయం: జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్(ఎల్‌డీఎం)గా ఏ.రవిప్రసాద్ నియమితులయ్యారు. ఎస్‌బీఐలో పలువురు మేనేజర్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇందులో భాగంగా ఖమ్మం ఎల్‌డీఎంగా ఉన్న ఏ.శ్రీనివాసరెడ్డిని భద్రాద్రి జిల్లా పాల్వంచలోని ఎస్‌బీఐ ఫైనాన్స్ విభాగం మేనేజర్‌గా, పాత పాల్వంచ స్పాంజ్ ఐరన్ ఎస్‌బీఐ బీఎం రవిప్రసాద్‌ను ఖమ్మం లీడ్ బ్యాంక్ మేనేజర్‌గా బదిలీ చేశారు. వీరిద్దరు బుధవారం కొత్త స్థానాల్లో విధుల్లో చేరారు.

వైరా అభివృద్ధికి రూ.15 కోట్లు



వైరా: మున్సిపాలిటీల అభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం నిధులు మంజూరు చేయనుండగా.. అభివృద్ధి పనులపై ప్రతిపాదనలు సమర్పించాలని ఉన్నతాధికారులు సూచించారు. ఈనేపథ్యాన వైరాకు సంబంధించి రూ.15 కోట్లతో ప్రతిపాదనలు పంపించినట్లు కమిషనర్ చింతల వేణు తెలిపారు. వాసవీ కల్యాణ మండపం, కూరగాయల మార్కెట్ రోడ్డు, మధిర రోడ్డు నుండి స్థానిక కేవీసీఎం కళాశాల రోడ్డు వరకు రూ.5కోట్లతో డ్రెయినేజీలు, సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదించారు. అలాగే, రూ.4.50 కోట్లతో డంపింగ్ యార్డు అభివృద్ధి, రూ.50లక్షలతో ప్రస్తుతం ఉన్న కూరగాయల మార్కెట్‌ను పాత మార్కెట్ ప్రాంతానికి తరలించేందుకు ప్రతిపాదనల్లో పేర్కొన్నారు. ఇవేకాక వైరా క్రాస్‌రోడ్డు, పల్లిపాడు జంక్షన్ల అభివృద్ధికి రూ.5 కోట్లు మంజూరు చేయాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత



బ్లడ్‌బ్యాంక్‌లో తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ

సత్తుపల్లిటౌన్: సీజనల్ వ్యాధులను సమర్థవంతంగా అరికట్టేలా టాస్క్‌ఫోర్స్ సమావేశాలు, విపత్తు నివారణ సమావేశాలు నిర్వహించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కళావతిబాయి సూచించారు. సత్తుపల్లిలోని రక్తనిల్వ కేంద్రాలను గురువారం తనిఖీ చేసిన ఆమె ప్రభుత్వ వైద్యులు, సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. వ్యాధులు ప్రబలకుండా ప్రతిఒక్కరు వ్యక్తిగతంగానే కాక పరిసరాల పరిశుభ్రత పాటించేలా అవగాహన కల్పించాలని తెలిపారు. అలాగే, వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలు మరింత విస్తృతం చేయాలని సూచించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ టి.సీతారాం, జిల్లా మలేరియా అధికారి వెంకటరమణ, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కె.దేవేందర్‌రెడ్డి, డెమో సాంబశివరెడ్డి పాల్గొన్నారు.

సివిల్స్ అభ్యర్థులకు శిక్షణ

భద్రాచలంటౌన్: సివిల్ సర్వీసెస్ పరీక్షలకు సిద్ధమవుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యాన హైదరాబాద్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీఓ బి.రాహుల్ తెలిపారు. రెసిడెన్షియల్ విధానంలో ఇంటిగ్రేటెడ్ గైడెన్స్, శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. వార్షికాదాయం రూ.3లక్షలకు మించని అభ్యర్థులు శుక్రవారం లోగా http://twd.telanganagov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

లెక్కలు పక్కాగా తేల్చాలా...



పరికరాలు సిద్ధం చేసుకుంటున్న సర్వేయర్లు

ప్రభుత్వం భూభారతి చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చాక భూముల సర్వేయర్లుగా పలువురిని నియమించింది. ఇందులో భాగంగా జిల్లాలో 500మందికి పైగా ఎంపికయ్యారు. వీరికి ఖమ్మం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో భూముల కొలతలు వేయడం, హద్దుల నిర్ధారణపై నిపుణుల ద్వారా శిక్షణ ఇస్తున్నారు. గతంలోనే థియరీ శిక్షణ ఇవ్వగా.. ఇప్పుడు కొలతలు వేయడం తదితర అంశాలపై ప్రాక్టికల్‌గా అవగాహన కల్పిస్తున్నారు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్



కొలతలను పరిశీలిస్తూ...



పరికరాల వినియోగంపై అవగాహన..

సీలింగ్ భూముల స్వాధీనం

- ఇతరులకు అమ్మినట్లు తేలడంతో చర్యలు
- స్వాధీనం చేసుకున్న భూమి విలువ రూ.50కోట్లు!



హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేస్తున్న ఉద్యోగులు

ఖమ్మంఅర్బన్: సీలింగ్ భూములను లబ్ధిదారులు సాగు చేసుకోకుండా ఇతరులకు అమ్ముకున్నట్లు తేలడంతో స్వాధీనం చేసుకోవడంపై అధికారులు దృష్టి సారించారు. ఈమేరకు ఖమ్మం అర్బన్ మండలం మల్లెమడుగు గ్రామంలో సర్వే నంబర్ 196లో ఉన్న 9.9 ఎకరాల భూమిని కోర్టు ఆదేశాలతో గురువారం ఖమ్మం అర్బన్ ఆర్ఐ వాహిద్, సర్వేయర్ నాగేశ్వరరావు స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బోర్డు ఏర్పాటుచేశారు. ఈ భూమి విలువ సుమారు రూ.50 కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు.

నిబంధనల ఉల్లంఘనతో..

సర్వేనంబర్ 196లోని భూములను గతంలో ఇద్దరు రైతులకు అసైన్‌మెంట్ రూపంలో కేటాయించారు. అయితే, స్వయంగా సాగు చేసుకోవాలే తప్ప విక్రయించొద్దనే నిబంధన విధించారు. కానీ వారిద్దరు ఇతరులకు అమ్మగా.. ఆపై ఇంకొన్ని చేతులు మారినట్లు తేలింది. ఈనేపథ్యాన కోర్టు సూచనల మేరకు 9.9 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నామని తహసీల్దార్ సైదులు తెలిపారు. ఈ భూమిని ప్రభుత్వ అవసరాలకు వినియోగించాలని నిర్ణయించగా, మళ్లీ ఎవరూ ఆక్రమించకుండా హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేశారు.

ప్లాట్ల యజమానుల్లో ఆందోళన

సీలింగ్ భూములు తీసుకున్న వారు సాగు చేయకపోవడమే కాక ఇతరులకు విక్రయించారు. ఆపై చేతులు మారగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు దక్కించుకుని ప్లాట్లుగా విడగొట్టి 80 మందికి విక్రయించినట్లు తెలిసింది. నిబంధనలు ఉల్లంఘించారని అధికారులు కోర్టును ఆశ్రయించగా, కోర్టు ఉత్తర్వులతో స్వాధీనం చేసుకోవడంతో విషయం తెలియక ప్లాట్లు కొనుగోలు చేసిన వారు ఆందోళన చెందుతున్నారు. అధికారులు భూమిని స్వాధీనం చేసుకున్నట్లు తెలియగానే పలువురు అక్కడకు చేరుకుని డాక్యుమెంట్ల ఆధారంగా పరిశీలించడం కనిపించింది.

వరద ఉధృతి అంచనా తప్పొద్దు

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



మాట్లాడుతున్న కలెక్టర్

ఖమ్మం సహకారనగర్: వరద ఉధృతిని లెక్క తప్పకుండా అంచనా వేయడం ద్వారా ముంపు సమస్య ఎదురుకాదని, ఆ దిశగా పటిష్ట వ్యవస్థను ఏర్పాటు చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డితో కలిసి విపత్తుల సన్నద్ధతపై గురువారం ఆయన వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముంపును త్వరగా గుర్తిస్తేనే ప్రజలను కాపాడవచ్చని చెప్పారు. నీటి వనరుల్లో నిల్వలు, ఎగువన మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లో వర్షపాతం, అక్కడి నుంచి వచ్చే వరద వివరాలను నీటి పారుదల శాఖ అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. తీర్థాల, మున్నేరు, ఆకేరు వద్ద ఎప్పటికప్పుడు వివరాలు నమోదు చేసేలా వ్యవస్థలు రూపొందించాలని తెలిపారు. అలాగే, అవసరమైన చోట వాటర్ గేజ్ ఏర్పాటు చేయాలని, నీటిపారుదల శాఖ, రెవెన్యూ అధికారులు వాట్సాప్ గ్రూప్‌గా ఏర్పడి సమాచారం ఇచ్చిపుచ్చుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈసమావేశంలో ఇరిగేషన్ ఎస్ఈ ఎం.వెంకటేశ్వర్లు, సీపీఓ ఏ.శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు వెంకట్రాం, జి.నర్సింహారావు, ఉదయ్‌ప్రతాప్, సైదులు, పి.రాంప్రసాద్ పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నియామకం ఎప్పుడు?

- సీనియర్లకే పదవి ఇచ్చేందుకు అధికారుల మొగ్గు
- పనితీరే ప్రామాణికంగా తీసుకోవాలని పలువురి సూచన

ఖమ్మం స్పోర్ట్స్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) జిల్లా కార్యదర్శి పదవి నియామకంలో జాప్యం జరుగుతోంది. ఇప్పటికే జాతీయ పాఠశాలల క్రీడల క్యాలెండర్ విడుదలైనప్పటికీ కార్యదర్శిని నియమించడంలో ఆలస్యంపై విమర్శలు వస్తున్నాయి. విద్యాసంవత్సరం ప్రారంభమై ఇరవై రోజులు దాటినా స్కూల్ గేమ్స్ కార్యదర్శిని నియమించడంలో విద్యాశాఖ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. పదవి కోసం జిల్లాలో సీనియర్లు అయిన ఐదుగురు ఫిజికల్ డైరెక్టర్ల పేర్లు ప్రతిపాదించగా, ఇందులో ముగ్గురు తమకొద్దని చెప్పినట్లు తెలిసింది. దీంతో ఇద్దరే మిగలగా.. వారిలో సీనియర్ పేరును రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌కు పంపించి ఖరారు చేయాల్సి ఉంటుంది. ఈనేపథ్యాన జిల్లా కేంద్రానికి సమీప పాఠశాలలో పనిచేసే వారిని నియమిస్తే మంచిదని ఇంకొందరు విద్యాశాఖ అధికారులకు ప్రతిపాదించారు. మరోపక్క సీనియర్, జూనియర్ పీడీలని కాకుండా జిల్లా పాఠశాలల క్రీడల నిర్వహణ బాధ్యతలను ఎవరు బాగా చేస్తారో పరిశీలించాక నియామకం చేపట్టాలని మరికొందరు సూచిస్తున్నారు. కాగా, గతంలో జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించిన చేసిన వారు అప్పులు తీర్చలేని స్థితిలో ఉండగా, ఇప్పుడు బాధ్యతలు తీసుకునే వారికి అదే పరిస్థితి ఎదురవుందనే భావనలో చాలామంది వెనుకంజ వేస్తున్నట్లు సమాచారం. జిల్లా విద్యాశాఖ నుంచి రూపాయి విడుదల కాని నేపథ్యాన పదవి తీసుకోకపోవడమే మంచిదనే భావనలో ఉన్నట్లు తెలిసింది.

అంత స్పాన్సర్ల దయే...

ఏటా రెండు నుంచి నాలుగు క్రీడాంశాల్లో రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలు నిర్వహించేలా జిల్లాలకు బాధ్యతలు అప్పగిస్తారు. కానీ నిధులు మాత్రం రాకపోవడంతో అధిక శాతం స్పాన్సర్ల దయపైనే ఆధాపడాల్సి వస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి పదవి చేపట్టేందుకు చాలా మంది వెనుకంజ వేస్తుండడం.. జాబితాలో ఒకరిద్దరే మిగలడంతో ఎంపిక చేయడం అధికారులకు కష్టమవుతోందని తెలుస్తోంది.

పనులు పకడ్బందీగా చేపట్టాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని 15 ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు రూ.2.96కోట్ల నిధులు కేటాయించిన నేపథ్యాన అవసరమైన సౌకర్యాలు కల్పించేలా పనులు పకడ్బందీగా చేపట్టాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం ఆమె ఇంటర్మీడియట్, ఆర్‌టీసీ, పీఆర్ అధికారులతో సమావేశమయ్యారు. ప్రభుత్వం కేటాయించిన నిధులతో తాగునీటి సరఫరా, విద్యుత్ సంబంధిత పనులే కాక టాయిలెట్ల మరమ్మతులు, ల్యాబ్ సామగ్రి కొనుగోలు చేయాలన్నారు. అవసరమైన చోట భవనాలకు రంగులు వేయించాలని తెలిపారు. అలాగే, కళాశాల వేళలకు అనుగుణంగా ఆర్టీసీ బస్సులు నడిపించాలని సూచించారు. డీఐఈఓ రవిబాబు, అధికారులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి అర్చకులు గురువారం 108 సువర్ణ పుష్పాలతో వైభవంగా అర్చన నిర్వహించారు. ఆ తర్వాత నివేదన సమర్పించి హారతి, మంత్రపుష్పం సమర్పించారు. కార్యక్రమంలో వేద పండితులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్ శర్మ, ఆలయ ఈఓ ఎన్.రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

చెక్‌డ్యాంల కూల్చివేతకు గ్రీన్‌సిగ్నల్?

రంగనాయకులగుట్ట వద్ద పూర్తిగా, ప్రకాష్‌నగర్‌లో మీటర్ కూల్చివేత



రంగనాయకుల గుట్ట వద్ద చెక్‌డ్యాం

ఖమ్మంఅర్బన్: ఖమ్మం అర్బన్, రూరల్ మండలాల్లోని మున్నేటి పరీవాహకంలో వరద ముంపునకు కారణంగా భావిస్తున్న రెండు చెక్‌డ్యాంల కూల్చివేతలకు కలెక్టర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో గురువారం వరద ముంపు, ముందస్తు చర్యలపై జరిగిన సమీక్షలో చెక్‌డ్యాంల అంశం చర్చకు వచ్చినట్లు సమాచారం. గత ఏడాది మున్నేటికి వరద ముంచెత్తగా రెండు పక్కల కాలనీలు నీట మునిగాయి. ఇందుకు చెక్‌డ్యాంలే కారణమని కొన్నాళ్ల క్రితం నివేదిక ఇవ్వగా, కూల్చివేయాలని భావించారు. ఈమేరకు సమీక్షించిన కలెక్టర్.. రంగనాయకుల గుట్ట వద్ద ఉన్న చెక్‌డ్యాంను పూర్తిగా తొలగించడంతో పాటు ప్రకాష్‌నగర్ వద్ద చెక్‌డ్యాంను ఒక మీటర్ ఎత్తు తగ్గించే పనులు చేపట్టాలని సూచించినట్లు తెలిసింది. ఇది అమలైతే రంగనాయకులగుట్ట వద్ద చెక్ డ్యాం కనుమరుగు కానుంది. ఇక ప్రకాశ్‌నగర్ వద్ద మూడేళ్ల క్రితం చెక్‌డ్యాం నిర్మించగా, అడుగు మేర తొలగించి ఆతర్వాత పరిస్థితుల ఆధారంగా నిర్ణయం తీసుకోవచ్చనే భావనకు అధికారులు వచ్చినట్లు తెలిసింది.



హరియాణా అసెంబ్లీ స్పీకర్ హర్విందర్‌తో మేయర్, డిప్యూటీ మేయర్

ఢిల్లీ సమావేశంలో మేయర్, డిప్యూటీ మేయర్

అమృత్ పథకం అమలుపై చర్చించేందుకు దేశవ్యాప్తంగా మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ల సమావేశం కొత్త ఢిల్లీలో గురువారం ప్రారంభమైంది. రెండు రోజుల పాటు జరిగే ఈ సమావేశంలో ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా పాల్గొన్నారు.
– ఖమ్మం మయూరిసెంటర్

చినుకు పడితే.. కునుకు లేదు

- భయాందోళనలో పెదవాగు ఆయకట్టు రైతులు, లోతట్టు ప్రజలు
- ఏపీ ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందంటూ అసహనం
- జిల్లా మంత్రి పరిచయాలు, ప్రయత్నాలు ఏమయ్యాయని నిలదీత



కొద్దిపాటి వర్షానికే పెదవాగు ప్రాజెక్టు రింగ్‌బండ్ నిండుగా వచ్చి చేరిన వరదనీరు

అశ్వారావుపేట : గోదావరి బేసిన్ పరిధిలోని పెదవాగు మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టు పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేయకుండా ఏపీ ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందంటూ ఆయకట్టు రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది జూలై 18న క్లౌడ్‌బరస్ట్‌కు ప్రాజెక్టు కట్టతెగిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత ఇరు రాష్ట్రాల ప్రజాప్రతినిధులు, అధికారులతో పాటు జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ సైతం సందర్శించారు. అనంతరం గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డ్ సమావేశంలోనూ ఇరురాష్ట్రాల ఇరిగేషన్ అధికారులు ప్రాజెక్టు పునర్నిర్మాణానికి సమష్టి అంగీకారం తెలిపారు. ఈ సీజన్‌కే సాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలని, ఆయకట్టు రైతులకు న్యాయం చేయాలని, దిగువ గ్రామాలకు వరద ముప్పు లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలని నిర్ణయించారు. ఇందుకు రూ.19 కోట్ల వ్యయంతో తెలంగాణ ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయగా అందులో 80 శాతం నిధులు జీఆర్ఎంబీకి డిపాజిట్ చేసేందుకు ఏపీ అధికారులు అంగీకరించారు. ఇక ఆ తర్వాత నిధుల్లేవు, పనుల్లేవు. దీంతో రైతులు, లోతట్టు ప్రాంతాల వారి పరిస్థితి 'చినుకు పడితే .. కునుకు లేదు' అన్నట్టుగా మారింది.

'రింగ్‌బండ్'కు ముప్పు.!

అశ్వారావుపేటరూరల్: పెదవాగు ప్రాజెక్టులో రూ.కోట్ల వ్యయంతో తాత్కాలికంగా నిర్మించిన రింగ్‌బండ్‌కు వర్షాలు, వరదతో ముప్పు పొంచి ఉంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో మట్టికట్టకు బీటలు ఏర్పడుతుండగా, ఓ చోట భారీగా కోతకు గురై గుంత ఏర్పడింది. వర్షాలు ఇంకా కొనసాగితే మట్టికట్ట వద్ద గండి పడే ప్రమాదం ఉందని ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. రూ. 3.50 కోట్లు వెచ్చించి నిర్మించిన రింగ్‌బండ్ విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు.. రింగ్‌బండ్‌పై ఆధారపడి పంటలు సాగు చేయాలా, వద్దా అనే సందిగ్ధంలో ఉన్నారు.

అసెంబ్లీలో చర్చిస్తానన్న పోలవరం ఎమ్మెల్యే..

పెదవాగు ఆయకట్టు మొత్తం 16 వేల ఎకరాల్లో 13 వేల ఎకరాలు ఏపీలోని కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోనే ఉంది. అందుకే ప్రాజెక్టు పునర్నిర్మాణానికి 80 శాతం నిధులు భరించేందుకు జీఆర్ఎంబీ సమావేశంలో ఏపీ ఇరిగేషన్ అధికారులు అంగీకరించారు. పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఫిబ్రవరి 11న అశ్వారావుపేటకు వచ్చినపుడు పెదవాగు అంశాన్ని ప్రస్తావిస్తూ అసెంబ్లీలో ప్రాజెక్టు సమస్యపై మాట్లాడతానని హామీ ఇచ్చారు. అయితే నాటి నుంచి అసెంబ్లీ సమావేశాలు జరగకున్నా.. అధికార పార్టీ ఎమ్మెల్యే కాబట్టి నేరుగా సీఎంతో మాట్లాడొచ్చు కదా అని రైతులు అంటున్నారు. పోల'వరం' ఎమ్మెల్యే హామీ కూడా ఆచరణ సాధ్యం కాలేదని ఆవేదన చెందుతున్నారు.

అటకెక్కిన తుమ్మల హామీ..

గతేడాది జూలై 18వ తేదీ రాత్రి పెదవాగు ప్రాజెక్టు కట్ట తెగిపోగా 21న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సందర్శించారు. పంటలు, ఇళ్లు దెబ్బతినడంపై విచారం వ్యక్తం చేయడమే కాక ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యంతోనే ఇలా జరిగిందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాజెక్టుకు మరమ్మతులు కాదు.. రీడిజైన్ చేయడమే శాశ్వత పరిష్కారమని, ఈ విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళతానని ప్రకటించారు. జీఆర్ఎంబీ, ఏపీ ప్రభుత్వంతో సమన్వయం చేస్తామని చెప్పారు. ప్రస్తుతం ఉన్న 40 వేల క్యూసెక్కుల సామర్థ్యాన్ని 80 వేల క్యూసెక్కులకు పెంచేలా ప్రతిపాదనలు తయారు చేయాలని ఇరిగేషన్ అధికారులకు ఆదేశించారు. 2025 వానాకాలం నాటికి రీ డిజైన్, నిర్మాణ పనులు పూర్తయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో రైతుల్లో సరికొత్త ఆశలు చిగురించాయి. అయితే ఏడాది కావొస్తున్నా ఇవేమీ ఆచరణకు నోచుకోకపోవడంతో వారిలో నిరాశ అలుముకుంది.

ఏపీ నిధులు రావడమే ఆలస్యం

జీఆర్ఎంబీకి తెలంగాణ ప్రభుత్వం సమర్పించిన నివేదిక ప్రకారం రూ.19 కోట్ల నిధులు అవసరం. ఆయకట్టు పంపిణీ ప్రకారం ఏపీలోనే 13వేల ఎకరాలు ఉంది. అశ్వారావుపేట మండలంలో 3వేల ఎకరాలే. ప్రాజెక్టు పునర్నిర్మాణ వ్యయంలో 80 శాతం నిధులు సమకూర్చేందుకు ఏపీ అధికారులు అంగీకరించారు. వారు జీఆర్ఎంబీకి నిధులు జమ చేస్తే పనులు ప్రారంభించొచ్చు.
– ఏ.కృష్ణ, ఇరిగేషన్ డీఈఈ

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు ముష్టికుంట్ల విద్యార్థులు



ఫరీదా, నవ్యశ్రీ

బోనకల్‌: ఖమ్మం సర్దార్‌ పటేల్‌ స్టేడియంలో నిర్వహించిన అథ్లెటిక్స్‌ ఎంపిక పోటీల్లో బోనకల్‌ మండలం ముష్టికుంట్ల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా 90 మంది విద్యార్థులు పాల్గొనగా అండర్‌ పాఠశాల విద్యార్థులు బొడ్డుపల్లి నవ్యశ్రీ, షేక్‌ ఫరీదా ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే జట్టుకు ఎంపికయ్యారు. ఈమేరకు విద్యార్థులను హెచ్‌ఎం భాగ్యలక్ష్మి, పీఈటీ నవీద్‌పాషా, ఉపాధ్యాయులు అభినందించారు.

సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలి



కంప్యూటర్‌ ద్వారా బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

వైరారూరల్‌: విద్యార్థులు పాఠ్యపుస్తకాల ద్వారా బోధననే కాక సాంకేతిక పరిజ్ఞానాన్ని సైతం పెంపొందించుకోవాలని వైరా ఎంఈఓ కొత్తపల్లి వెంకటేశ్వర్లు సూచించారు. మండలంలోని నారపునేనిపల్లి యూపీఎస్‌ గతేడాది ఒకే విద్యార్థితో కొనసాగగా ఈసారి బడిబాట నిర్వహణతో 12మంది చేరారు. దీంతో గత కలెక్టర్‌ ముజమ్మిల్‌ ఖాన్‌ పాఠశాల అభివృద్ధికి రూ.6 లక్షలు కేటాయించారు. అంతేకాక ప్రస్తుత కలెక్టర్‌ అనుదీప్‌ దురిశెట్టి, అదనపు కలెక్టర్‌ శ్రీజ మరో రూ.1.55 లక్షలు మంజూరు చేయగా కంప్యూటర్‌ విద్యనందించేందుకు రూ.85 వేలు విలువైన రెండు కంప్యూటర్లు సమకూర్చారు. అలాగే, విద్యార్థులు ఇంటి నుంచి వచ్చివెళ్లేలా రవాణా సౌకర్యార్థం రూ. 70 వేలు కేటాయించారు. ఈమేరకు గురువారం పాఠశాలలో కంప్యూటర్లను ఎంఈఓ ప్రారంభించి మాట్లాడారు. ఉపాధ్యాయులు ఉమాపార్వతి, రాంబాబు పాల్గొన్నారు.

బాలుడి మృతదేహం లభ్యం

ఖమ్మంరూరల్‌: రూరల్‌ మండలంలోని రాజీవ్‌ స్వగృహ వద్ద మున్నేటిలో గల్లంతైన ఖమ్మంలోని లెనిన్‌నగర్‌కు చెందిన ఎస్‌కే.అహ్మద్‌(14) మృతదేహం గురువారం లభ్యమైంది. ఈత కోసం మంగళవారం సాయంత్రం వెళ్లిన బాలుడు ప్రమాదవశాత్తు గల్లంతు కాగా.. ఎన్‌డీఆర్‌ఎఫ్‌ సిబ్బంది, అన్నం ఫౌండేషన్‌ చైర్మన్‌ అన్నం శ్రీనివాసరావు నేతృత్వాన రెండు రోజులుగా గాలిస్తున్నారు. ఈనేపథ్యాన మృతదేహం లభించగా పోస్ట్‌మార్టం అనంతరం తల్లిదండ్రులకు అప్పగించినట్లు సీఐ ముష్కరాజు తెలిపారు.

వైద్యురాలి ఫోన్‌ హ్యాక్‌..

- రూ.5లక్షలు వసూలు చేసిన సైబర్‌ కేటుగాళ్లు

ఖమ్మంక్రైం: ఖమ్మంకు చెందిన ఓ వైద్యురాలి ఫోన్‌ను హ్యాక్‌ చేసిన సైబర్‌ నేరగాళ్లు సుమారు రూ.5లక్షలను కాజేశారు. ఖమ్మం ఎన్నెస్పీ రోడ్డుకు చెందిన డాక్టర్‌ స్వర్ణకుమారి ఫోన్‌ను గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం హ్యాక్‌ చేశారు. ఆపై ఆ నంబర్‌ ద్వారా రూ.55 వేలు కావాలంటూ ఆమె సన్నిహితులు, బంధువులకు మెసేజ్‌ చేశారు. దీంతో పలువురు రూ.5లక్షల మేర నిందితులు చెప్పిన నంబర్‌కు ఆన్‌లైన్‌లో పంపించారు. ఇంతలోనే కొందరు స్వర్ణలతకు ఫోన్‌ చేసి అత్యవసరంగా డబ్బు ఎందుకని ఆరా తీయడంతో తానెవరికీ మెసేజ్‌ చేయలేదని బదులివ్వగా మోసం బయటపడింది. దీంతో ఆమె భర్త డాక్టర్‌ బాబురత్నాకర్‌తో కలిసి గురువారం సైబర్‌ క్రైమ్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కొత్త మున్సిపాలిటీల్లో వార్డుల విభజన



కల్లూరు మున్సిపాలిటీ కార్యాలయం

గెజిట్‌ నోటిఫికేషన్‌ జారీ చేసిన ప్రభుత్వం

కల్లూరు: జిల్లాలో కొత్తగా ఏర్పడిన కల్లూరు, ఏదులాపురం మున్సిపాలిటీల్లో వార్డుల విభజన పూర్తయింది. ఇప్పటికే ముసాయిదా విడుదల చేసి అభ్యంతరాలు స్వీకరించారు. ఇలా అందిన అభ్యంతరాలను పరిష్కరించాక హద్దులు నిర్ణయించి వార్డుల విభజన ఖరారు చేశారు. ఈమేరకు కల్లూరు మున్సిపాలిటీని 20వార్డులుగా విభజించిన అధికారులు వార్డులు, ఓటర్ల వారీగా సరిహద్దులను ప్రకటించారు. ఇందులో ఒకటో వార్డుగా కప్పలబంధం(902 మంది ఓటర్లు), 2వ వార్డు(947 మంది)గా కప్పలబంధం తూర్పు మాలపల్లి నుంచి బెంజ్‌ వీధి వాడపల్లి కరుణమ్మ గృహం, వయా గ్రంథాలయం, పాగల్లి రత్నాకరమ్‌ గృహం(ఉత్తరం), తూర్పు మాలపల్లి, 3వ వార్డు(950 మంది)గా శ్రీరాంపురం, ఖాన్‌ఖాన్‌పేట, ఎన్‌ఎస్‌పీ కెనాల్‌ వరకు, 4వ వార్డు(954 మంది)గా తిరువూరు క్రాస్‌, ఖాన్‌ఖాన్‌పేట, ఎన్‌ఎస్‌పీ, 5వ వార్డు(929 మంది)గా మధిర రోడ్డులోని జీడీబీపల్లి, కల్లూరు తూర్పున శాంతినగర్‌, 6వ వార్డు(987 ఓటర్లు)గా వాచ్యానాయక్‌తండా బీసీ కాలనీ, రైస్‌మిల్లు నుంచి జీడీబీపల్లి బొడ్రాయి వరకు, 7వ వార్డు(880 మంది) హనుమాతండా, గనియాతండా, లక్ష్మాతండా, 8వ వార్డు(980 మంది) కిష్టయ్యబంజర, వీరబ్రహ్మేంద్ర నగర్‌ కాలనీ, స్వాగత్‌ రెస్టారెంట్‌ నుంచి గోపాలకుంట వరకు, 9వార్డు(932 మంది)గా పడమర లోకవరం, 10వార్డు(935 మంది)గా తూర్పు లోకవరం, పుల్లయ్యబంజర్‌ ఉత్తరం, తూర్పు ప్రాంతం, 11వ వార్డు(864 మంది) పుల్లయ్యబంజర్‌ దక్షిణ, పడమర ప్రాంతం, తూర్పు రామానగరంను ప్రకటించారు. అలాగే, 12వ వార్డు(950 మంది)గా కల్లూరులోని పుల్లయ్యబంజర్‌ రోడ్‌, ముత్యాలమ్మ గుడి, బొడ్డు కృష్ణ గృహం నుంచి అంబేద్కర్‌ విగ్రహం వరకు, 13వ వార్డు(930 మంది) ఓటర్లతో కుడి వైపు రియాజుద్దీన్‌ గృహం నుంచి ఇటికరాళ్ల చెరువు వరకు, 14వ వార్డు(921 మంది)గా ఎడమవైపు ఎల్‌వీఆర్‌ వీధి, యూపీఎస్‌ స్కూల్‌ రోడ్డు, కుడివైపు కట్టా గోపాలరావు గృహం నుంచి మిష్కిమ్‌ ఇంటి వరకు, 15వ వార్డు(929 మంది)గా కప్పలబంధం రోడ్డు, ఎల్‌వీర్‌ స్ట్రీట్‌ సైడ్‌, సాయిబాబా గుడి వరకు, 16వ వార్డు(919 మంది)గా ఎడమవైపు అంబేద్కర్‌ నగర్‌, విజ్ఞాన్‌స్కూల్‌, తూర్పు మాలపల్లి నారుమళ్ల విశ్వనాథం, వెంకటరత్నం గృహం వరకు, దక్షిణం వైపు మేకల కృష్ణ గృహం వరకు, 17వ వార్డు(904 మంది)గా ఎన్‌ఎస్‌పీ నుంచి అంబేదర్‌ నగర్‌ వరకు, 18వ వార్డు(956 మంది)గా ఓటర్లతో శాంతినగర్‌ 2, 3వ వీధులు, బ్యాంక్‌ వీధి, మధిర రోడ్డు, చంద్రుపట్ల రోడ్డు, ఎన్‌ఎస్‌పీ కెనాల్‌ నుంచి పాతబస్టాండ్‌ వరకు, బొమ్మరిల్లు వెంచర్‌, సురేష్‌ ఆసుపత్రి వెనుక భాగం, 19వ వార్డు(983 మంది)గా కృష్ణా మ్యాంగో మార్కెట్‌, కొత్తబస్టాండ్‌, శాంతినగర్‌ కుడివైపు 2, 3వ వీధులు, పడమర శాంతినగర్‌ వీధులు, 20వార్డును 939 మంది ఓటర్లతో పుల్లయ్యబంజర్‌ రోడ్‌ పడమర వైపు, పోలీస్‌ స్టేషన్‌ ఏరియా, అంబేద్కర్‌ విగ్రహం వరకు విభజించినట్లు మున్సిపల్‌ కమిషనర్‌ సంపత్‌కుమార్‌ వెల్లడించారు.

వార్డు ఆఫీసర్ల పాలనకు సిద్ధం

ఖమ్మంరూరల్‌: ఏదులాపురం కేంద్రంగా ఏర్పడిన మున్సిపాలిటీ పరిధిలో తొలుత సరైన సిబ్బంది, అధికారులు లేక పాలన సాఫీగా సాగలేదు. ఆతర్వాత కమిషనర్‌ ఆళ్ల శ్రీనివాసరెడ్డిని నియమించడంతో ఉన్న ఉద్యోగుల సేవలను వినియోగించుకుంటూ కొంత మేర గట్టెక్కించారు. ఇప్పటి వరకు గ్రామపంచాయతీ కార్యదర్శులే ఆయా వార్డులకు సంబంధించి పనులను చూస్తుండగా, ప్రస్తుతం 32 వార్డులకు సంబంధించి గెజిట్‌ జారీ చేసింది. దీంతో ప్రతీ వార్డుకు అధికారులు, సిబ్బందిని నియమించనున్నారు. తద్వారా చెత్తసేకరణ, తాగునీటి సరఫరా పర్యవేక్షణ తదితర పనులు సులువవుతాయని, సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారమవుతాయని భావిస్తున్నారు.

ప్రజల దృష్టి మళ్లించేందుకే బనకచర్లపై రాద్ధాంతం

మాస్‌లైన్‌ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు



మాట్లాడుతున్న పోటు రంగారావు, పక్కన నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్‌: వాగ్దానాల అమలులో విఫలమైన కాంగ్రెస్‌, కుంభకోణాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి బీఆర్‌ఎస్‌ కలిపి బనకచర్ల ప్రాజెక్టుపై రాద్ధాంతం మొదలుపెట్టాయని సీపీఐ(ఎంఎల్‌) మాస్‌లైన్‌ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఆరోపించారు. ఇదే సమయాన ఏపీ, తెలంగాణ నడుమ వివాదాన్ని పెంచి పెద్ద చేసి పెద్దన్న పాత్ర పోషిస్తూ లబ్ధి పొందాలని కేంద్రప్రభుత్వం యత్నిస్తోందని పేర్కొన్నారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాలక, ప్రతిపక్ష పార్టీల ఎత్తుగడలను రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు అర్థం చేసుకుని ఉద్రేకాలకు గురికావొద్దని ఆయన కోరారు. కృష్ణా, గోదావరి నికర జలాల పంపిణీ హేతుబద్ధంగా జరగాలని తాము కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈమేరకు మిగులు జలాల పంపిణీపై తెలంగాణ, ఏపీ అవసరాల ఆధారంగా కేంద్ర జలసంఘం రెండు రాష్ట్రాలతో చర్చించాలని డిమాండ్‌ చేశారు. కాగా, ఈనెల 9న కార్మిక, రైతు సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఇచ్చిన దేశ వ్యాప్త బంద్‌ను అన్ని వర్గాల ప్రజలు జయప్రదం చేయాలని రంగారారవు కోరారు. ఈ సమావేశంలో మాస్‌లైన్‌ నాయకులు ఆవుల వెంకటేశ్వర్లు, సీ.వై.పుల్లయ్య, జి.రామయ్య, ఆవుల అశోక్‌, కొల్లేటి నాగేశ్వరరావు, ఝాన్సీ, కె.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఫీజు బకాయిలు విడుదల చేయండి

పీడీఎస్‌యూ ఆధ్వర్యాన మంత్రుల కార్యాలయాల ముట్టడికి యత్నం



నాయకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

ఖమ్మంమయూరిసెంటర్‌: కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటినా విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌, స్కాలర్‌షిప్‌ బకాయిల విడుదలలో జాప్యం చేయడం సరికాదని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి వి.వెంకటేష్‌ పేర్కొన్నారు. బకాయిలు విడుదల చేయాలనే డిమాండ్‌తో నాయకులు గురువారం ఖమ్మంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయాల ముట్టడికి యత్నించారు. ఈక్రమాన పోలీసులు వారిని అడ్డుకొని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వెంకటేష్‌ మాట్లాడుతూ కాంగ్రెస్‌ ప్రభుత్వం విద్యారంగంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, రూ.వేల కోట్ల బకాయిలను చెల్లించడం లేదని ఆరోపించారు. ఇకనైనా బకాయిలు విడుదల చేయడంతో పాటు ప్రభుత్వ జూనియర్‌ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలుచేసి ఉచిత బస్‌ పాసులు జారీ చేయాలని డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్‌, నాయకులు వినయ్‌, కార్తీక్‌, పృథ్వీ, సురేష్‌, నసీర్‌, చందు, అశోక్‌, ప్రసాద్‌, పేర్ల వెంకటేష్‌, నరేంద్ర, వరుణ్‌, సంతోష్‌, అఖిల్‌, స్టాలిన్‌, తదితరులు పాల్గొన్నారు.

'తోపుడుబండి' ఆధ్వర్యాన డ్యూయెల్‌ డెస్క్‌ బెంచీలు



కొర్లగూడెం స్కూల్‌లో బెంచీలపై ఎమ్మెల్యే రాగమయి, తదితరులు

సత్తుపల్లి/కల్లూరురూరల్‌: తోపుడు బండి ఫౌండేషన్‌ చైర్మన్‌, దివంగత సాదిక్‌అలీ జయంతి సందర్భంగా ఆయన సతీమణి ఉష ప్రభుత్వ పాఠశాలలకు రూ.4లక్షల విలువైన డ్యూయెల్‌ డెస్క్‌ బెంచీలను గురువారం అందజేశారు. కల్లూరు మండలం కొర్లగూడెం, ఖాన్‌ఖాన్‌పేట, ఎన్నెస్పీ పాఠశాలకు ఎమ్మెల్యే డాక్టర్‌ మట్టా రాగమయి చేతుల మీదుగా అందించగా ఆమె మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సాదిక్‌అలీ మాదిరిగానే ఆయన కుటుంబీకులు అండగా నిలుస్తుండడం అభినందనీయమన్నారు. కల్లూరు మార్కెట్‌, సీడీసీ చైర్మన్లు భాగం నీరజాదేవి, నరేంద్ర, ఎస్సై హరిత, హెచ్‌ఎం చక్రవర్తితో పాటు కిషోర్‌దత్‌, విజయకుమార్‌ తదితరులు పాల్గొన్నారు. కాగా, సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి – దయానంద్‌ కుమార్తె ఆషా వర్ధంతిని సత్తుపల్లిలో నిర్వహించగా ఆమె చిత్రపటం వద్ద మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సతీమణి మాధురి, నాయకులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దొడ్డా శ్రీనివాసరావు, చల్లగుళ్ల నర్సింహారావు, దోమ ఆనంద్‌, చల్లారి వెంకటేశ్వరరావు, ఎం.డీ.కమల్‌పాషా, తోట సుజలరాణి, మట్టా సుజాత, డాక్టర్‌ శృతి పాల్గొన్నారు. అలాగే, గౌరిగూడెంలో మండపాటి ముత్తారెడ్డి తల్లి కోటమ్మ ఇటీవల మృతి చెందగా కుటుంబీకులను పరామర్శించారు.

పదోన్నతులు, బదిలీలపై దృష్టి సారించాలి



సభ్యత్వ నమోదులో పాల్గొన్న నాయకులు

టీఎస్‌యూటీఎఫ్‌ రాష్ట్ర ఉపాధ్యక్షులు దుర్గాభవాని

చింతకాని: ప్రభుత్వం ఇకనైనా ఉపాధ్యాయులు, ఉద్యోగుల పదోన్నతులు, బదిలీలపై దృష్టి సారించాలని టీఎస్‌ యూటీఎఫ్‌ రాష్ట్ర ఉపాధ్యక్షులు దుర్గాభవాని డిమాండ్‌ చేశారు. చింతకాని మండలంలోని పలు పాఠశాలలను గురువారం సందర్శించిన ఆమె నాయకులతో కలిసి సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా దుర్గాభవాని మాట్లాడుతూ ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడమే కాక పెండింగ్‌ బిల్లులు, డీఏలను విడుదల చేయాలన్నారు. అలాగే, కేజీబీవీ, యూఆర్‌ఎస్‌, ఆశ్రమ పాఠశాలల కాంట్రాక్ట్‌ ఉద్యోగులకు బేసిక్‌ పే ఇవ్వాలని, కేజీబీవీ ఉపాధ్యాయులకు సమ్మె కాలపు వేతనాన్ని చెల్లించాలని డిమాండ్‌ చేశారు. ప్రాథమిక పాఠశాలల్లో నర్సరీ, కేజీ తరగతులను ప్రవేశపెట్టి ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలని కోరారు. ఇదేసమయాన పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆమె సూచించారు. టీఎస్‌యూటీఎఫ్‌ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణ, తోటకూరి శ్రీనివాసరావు, నాయకులు నాగేశ్వరరావు, భాగ్య, ప్రీతమ్‌, జమలయ్య, అనిల్‌, సురేష్‌, రాజయ్య, పుల్లారావు, శశికుమార్‌, కృష్ణారావు, పాషా, మహేశ్వర్‌, వాసు, ఖాదర్‌, శ్రీనివాసరావు, శంకర్‌రెడ్డి, భిక్షం, వెంకటేశ్వర్లు, కిషన్‌, పూర్ణచందర్‌రావు, సంపత్‌కుమార్‌, తదితరులు పాల్గొన్నారు.

'రివర్‌సైడ్‌'కు ఆదరణ కరువు

గోదావరి నదీ తీరంలోని విడిది కుటీరాల తొలగింపు



నిరుపయోగంగా ఉన్న కుటీరాలు



కుటీరాలను తొలగిస్తున్న సిబ్బంది

భద్రాచలంటౌన్‌: భద్రాచలంలోని శ్రీసీతారామ చంద్రస్వామివారి దేవస్థానం సందర్శించిన భక్తులతోపాటు పర్యాటకులు గోదావరి నదీ తీరంలో బస చేసే విధంగా ఏర్పాటు చేసిన విడిది కుటీరాలను తొలగిస్తున్నారు. వర్షాకాలం కావడంతో గోదావరికి వరదలు వస్తే మునిగిపోతుందనే కారణంతోపాటు పర్యాటకుల నుంచి ఆదరణ లేకపోవడం మరో కారణంగా తెలుస్తోంది. గత జనవరిలో భద్రాచలం నదీ తీరంలో ఏర్పాటు చేసిన ఏరు ఉత్సవాల్లో భాగంగా కలెక్టర్‌ జితేష్‌ వి.పాటిల్‌ విడిది (రివర్‌ సైడ్‌ క్యాంప్‌) కుటీరాలు ఏర్పాటు చేయించారు. ప్రారంభం నుంచీ పర్యాటక ఆదరణ లభించలేదు. మొదటిసారి ఆన్‌లైన్‌లో బుక్‌ చేసుకుని 17 మంది విడిది చేశారు. ఆ తర్వాత ఒకరిద్దరు తప్ప ఎప్పుడూ పర్యాటకులతో కుటీరాలు నిండింది లేదు. చార్జీలు భారీగా ఉండటంతో పర్యాటకులు ఆసక్తి చూపడంలేదని భావించిన అధికారులు.. చార్జీలు తగ్గించారు. ఆఫ్‌లైన్‌లో బుక్‌ చేసుకునే వెసులుబాటు కూడా కల్పించారు. ముగ్గురు, నలుగురు సభ్యులు కలిగిన కుటుంబం బస చేసేలా సిద్ధం చేశారు. 12 గంటలు బస చేసే పర్యాటకులకు రూ.500 చార్జీతో పాటు వారి అభ్యర్థన మేరకు భోజన వసతి కల్పించాలని నిర్ణయించారు. అయినా ఆదరణ లేకపోవడంతో నిర్వహణ భారంగా మారింది. దీంతో నిర్వహణ బాధ్యతను డీఆర్‌డీఏ అధికారుల నుంచి స్వయం సహాయక సంఘాలకు అప్పగించారు. ఎండాకాలం తాటాకు పందిళ్లు కూడా ఏర్పాటు చేశారు. అయినా మార్పులేకపోవడంతో వాళ్లు కూడా వదిలేశారు. దీంతో పిచ్చి మొక్కలు పెరిగిపోయి, రాత్రి వేళ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. ఇక చంద్రుగొండ మండలం బెండాలపాడు, దుమ్ముగూడెం మండలం బొజ్జిగుప్ప, పాల్వంచ మండలం కిన్నెరసాని, ఐటీడీఏ గిరిజన మ్యూజియం వద్ద ఏర్పాటు చేసిన గిరిజన పల్లె వాతావరణ ఆవాసాలను పర్యాటకులు తిలకించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం అధికారులు సుమారు రూ.35 లక్షల వరకు ఖర్చు చేసినట్లు సమాచారం. వాటికి కూడా ఆదరణ లేకపోవడంతో ప్రజాధనం వృథా అయిందని పలువురు పేర్కొంటున్నారు.

కాంక్రీట్‌ మిక్చర్‌ వాహనం దగ్ధం

రఘునాథపాలెం: మండలంలోని మంచుకొండ వద్ద ఎత్తిపోతల పథకం పనుల్లో వినియోగిస్తున్న కాంక్రీట్‌ మిక్చర్‌ వాహనం దగ్ధమైంది. ఈనెల 1వ తేదీన షార్ట్‌ సర్క్యూట్‌ కారణంగా మంటలు చెలరేగడంతో ఈ ప్రమాదం జరగగా రూ.18లక్షల విలువైన వాహనం పూర్తిగా కాలిపోయింది. ఘటనపై కాంట్రాక్టు కంపెనీ మేనేజర్‌ ఇచ్చిన ఫిర్యాదుతో గురువారం కేసు నమోదు చేసినట్లు రఘునాథపాలెం సీఐ ఉస్మాన్‌షరీఫ్‌ తెలిపారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య



అంజలి (ఫైల్‌)

మధిర: మండలంలోని మడుపల్లికి చెందిన వివాహిత పారా అంజలి(21) కుటుంబ కలహాల కారణంగా బలవన్మరణానికి పాల్పడింది. ఆమె సిరిపురం గ్రామానికి చెందిన తడికమళ్ల రామును తొమ్మిది నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకుంది. మధిరలోని సాయినగర్‌లో అద్దెకు ఉంటుండగా, ఇద్దరు ప్రైవేట్‌ ఉద్యోగాలు చేస్తున్నారు. అయితే, అంజలిని రాము మానసికంగా, శారీరకంగా వేధిస్తుండడంతో ఆమె ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఘటనపై అంజలి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదుతో ఎస్‌హెచ్‌ఓ రమేష్‌ కేసు నమోదు చేయగా, వైరా ఏసీపీ రహమాన్‌ వివరాలు ఆరా తీశారు.

గోవింద్రాల గ్రామంలో...

కామేపల్లి: కుటుంబ కలహాల నేపథ్యాన ఓ మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కామేపల్లి మండలం గోవింద్రాలకు చెందిన వాంకుడోత్‌ ఉష(28)కు కొన్నేళ్ల క్రితం మహబూబాబాద్‌ జిల్లా డోర్నకల్‌ మండలం బొడ్రాయి తండాకు చెందిన వ్యక్తితో వివాహం జరిగింది. కుటుంబ కలహాలతో రెండు నెలల క్రితం ఆమె గోవింద్రాలలో తల్లి తేజావత్‌ రామీ ఇంటికి వచ్చి ఉంటోంది. ఈనేపథ్యాన గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమె ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఘటనపై తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు కామేపల్లి పోలీసులు తెలిపారు.

అమ్మకానికి 'సింగరేణి ప్రైవేట్‌ సెక్యూరిటీ'

ప్రైవేటు సెక్యూరిటీ గార్డు పోస్టులకు వసూళ్లు

- ఒక్కో ఔట్‌సోర్సింగ్‌ ఉద్యోగానికి రూ.1.50 లక్షలు
- డబ్బులు ఇచ్చినా ఉద్యోగం రాక ఓ యువకుడి ఆత్మహత్య
- సదరు ఏజెన్సీపై చర్యలు చేపట్టని సింగరేణి అధికారులు

మణుగూరు టౌన్‌: సింగరేణి కాలరీస్‌ మణుగూరు ఏరియాలో ప్రైవేట్‌, ఔట్‌సోర్సింగ్‌ సెక్యూరిటీ గార్డు పోస్టుల నియామకంలో వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. డబ్బులు ఇచ్చినా కాంట్రాక్ట్‌ దక్కించుకున్న ఏజెన్సీ ఉద్యోగం ఇవ్వకపోవడంతో బాధితులు మనోవేదన చెందుతున్నారు. ఈ క్రమంలోనే పినపాక మండలానికి చెందిన యువకుడు పూనెం సంప్రీత్‌ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ సంఘటన సింగరేణిలో చర్చనీయాంశంగా మారగా, సూసైడ్‌ నోట్‌ సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టింది.

ఒక్కో పోస్టుకు రూ. 1.50 లక్షలు!

సదరు కంపెనీ 2024లో సెక్యూరిటీ విభాగం కాంట్రాక్ట్‌ దక్కించుకోగా, 2025 డిసెంబర్‌తో గడువు ముగియనుంది. పోస్టులకు ప్రారంభం నుంచే డబ్బులు వసూళ్లు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో పోస్టుకు రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకు వసూళ్లు చేసినట్లు సమాచారం. కంపెనీ సూపర్‌వైజర్‌ అమరేందర్‌రెడ్డికి సంప్రీత్‌ డబ్బులు ఇచ్చినట్లు తెలుస్తోంది. నెలలు గడుస్తున్నా ఉపాధి చూపకపోవడంతో పలుమార్లు అడుగగా అమరేందర్‌రెడ్డి ఖాళీ చెక్కు ఇచ్చినట్లు తెలుస్తోంది. చెక్కు ఇచ్చినా డబ్బులు అందక, ఉపాధి లభించక మరోవైపు అప్పు, వడ్డీలు కట్టలేక సంప్రీత్‌ మనోవేదన చెంది గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విప్పలసింగారానికి చెందిన ఓ యువకుడి నుంచి రూ.లక్ష తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. నెలల తరబడి సెక్యూరిటీ గార్డు ఉద్యోగం కల్పించకపోవడంతో వడ్డీకి తెచ్చిన డబ్బులు కావడంతో కుటుంబ పెద్ద గుండెపోటుతో మృతి చెందాడని స్థానికులు చెబుతున్నారు. గతంలో పగిడేరుకు చెందిన కొందరు యువకులు రన్నింగ్‌లో ఎంపికైనా డబ్బులు డిమాండ్‌ చేయడంతో.. వారు సూపర్‌వైజర్‌కు డబ్బులు ఇచ్చి మోసపోయారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించడంతో డబ్బులు తిరిగి పొందారు.

చర్యలు తీసుకోని సింగరేణి యాజమాన్యం

సింగరేణి నిర్వాసితులకు, ప్రభావిత ప్రాంతాల నిరుద్యోగులకు యాజమాన్యం ప్రైవేటు సెక్యూరిటీ గార్డులుగా ఉపాధి కల్పిస్తుంది. కానీ సదరు కాంట్రాక్టర్‌ డబ్బులు తీసుకుని స్థానికేతరులను నియమించారనే ఆరోపణలు వచ్చాయి. ఈ విషయమై డైరెక్టర్‌(పా), సెక్యూరిటీ జీఎంలకు ఫిర్యాదులు అందినా ఎటువంటి చర్యలూ తీసుకోలేదని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం స్పందించి సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని బాధితులు, కార్మిక నాయకులు కోరుతున్నారు. కాగా ఈ వ్యవహారంపై సింగరేణి మణుగూరు ఏరియా డీజీఎం (పర్సనల్‌) సలగల రమేష్‌ను వివరణ కోరగా.. సమస్యపై మురళి మ్యాన్‌ పవర్‌ కంపెనీ బాధ్యులతో చర్చించామని, సమస్యను పరిష్కరించాలని సూచించామని తెలిపారు.



సింగరేణి జీఎం కార్యాలయం

నా చావుకు వారే కారణం

సూసైడ్‌ నోట్‌ రాసి యువకుడి ఆత్మహత్య





సూసైడ్‌ నోట్‌ (ఇన్‌సెట్‌) సంప్రీత్‌ (ఫైల్‌)

పినపాక: సింగరేణి మణుగూరు ఏరియాలో కాంట్రాక్ట్‌ పద్ధతిన సెక్యూరిటీ గార్డు ఉద్యోగం ఇప్పిస్తామంటూ ఏడాది క్రితం డబ్బు వసూలు చేసిన సంస్థ.. ఇప్పటికీ ఉద్యోగం ఇవ్వకపోవడంతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు బలవన్మరణం చెందాడు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. పినపాక మండలం పోట్లపల్లి గ్రామానికి చెందిన పూనెం సంప్రీత్‌(25) సెక్యూరిటీ గార్డు ఉద్యోగం కోసం గతేడాది మురళీ మ్యాన్‌ పవర్‌ కంపెనీకి రూ.1.50 లక్షలు చెల్లించాడు. ఐదారు నెలలు గడిచినా ఉద్యోగం రాకపోవడంతో సంస్థ సూపర్‌వైజర్‌ అమరేందర్‌రెడ్డిని నిలదీశాడు. దీంతో ఆయన సంప్రీత్‌కు ఖాళీ చెక్కు ఇవ్వగా.. ఆ చెక్కు కూడా బౌన్స్‌ అయింది. అయినా కంపెనీ వారు కోర్టు విచారణకు రాకపోవడం, మరోవైపు సంప్రీత్‌ చేసిన అప్పులకు వడ్డీలు పెరుగుతుండడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో బుధవారం పురుగుల మందు తాగగా.. కుటుంబసభ్యులు భద్రాచలం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. కాగా, 'అమ్మా, నాన్నా నన్ను క్షమించండి, నా చావుకు మురళీ మ్యాన్‌ పవర్‌ సెక్యూరిటీ ఏజెన్సీనే కారణం, ఏజెన్సీకి చెందిన మురళి, వెంకట్‌, మణికంఠ, అమరేందర్‌రెడ్డే బాధ్యులు' అంటూ సంప్రీత్‌ రాసిన సూసైడ్‌ నోట్‌ గురువారం సోషల్‌ మీడియాలో చక్కర్లు కొట్టింది.